




# దూరపు కొండలు నునుపు

ఆదోని లలిత

అది మల్లెలు పరచినట్లున్న వెన్నెల రాత్రి. ఆ వెన్నెలలో తెల్లచీర కట్టుకుని, తెల్ల రవిక తొడిగి, మల్లె పువ్వులు పెట్టుకున్న అందమైన జవ్వనిలా ఉంది మూడంతస్తుల మేడ 'శాంతి నిలయం'.

అనురాగ్ ఆ ఇంటి యజమాని. అతనికి అనుపమ - అందమైన, అనుకూలవతి అయిన భార్య. అనురాగ్ దంపతులు రెండవ అంతస్తులో ఉంటున్నారు.

మొదటి అంతస్తులోని రెండు భాగాలలో మోహన్ - మాలతి ఒకభాగంలోనూ, మూర్తి - మంజుల మరొక భాగంలోనూ ఉన్నారు.

గ్రౌండ్ ఫ్లోర్‌లో గంగాధరం - గంగ ఒక భాగంలోనూ, గోపి - గాయత్రి మరో భాగంలోనూ ఉన్నారు.

ఆ వెన్నెల రాత్రి శాంతినిలయంలోని పడక గదులలో మాత్రం లైట్లు వెలుగుతున్నాయి. ఆ ప్రశాంత వాతావరణంలో వెన్నెలను కురిపిస్తున్న చందమామకు ఒక కొంటె కోరిక కలిగింది. అది తన వెన్నెల కనులతో శాంతినిలయంలోని ఆయా పడక గదులలో జరుగుతున్న విశేషాలను చూడాలని.

మొట్టమొదట చందమామ వెన్నెలకనులు పై అంతస్తులోని అనురాగ్ - అనుపమల పడక గదిలోకి కిటికీగుండా తొంగిచూశాయి.

అది ఎయిర్ కండిషన్‌తో సహా అన్ని హంగులూ ఉన్న అందమైన పడక గది. అనురాగ్ సోఫాలో కూర్చున్నాడు. ముందున్న టీపాయ్ మీద ఫారిన్ లిక్కర్, తినటానికి జీడిపప్పులు.

అనుపమ ఎదురుగా కూర్చుని తదేకంగా భర్తవైపు చూస్తోంది. తమ పెళ్లయిన సంవత్సరకాలంలో భర్తలో ఉన్న ఈ వ్యసనాన్ని మానిపించాలని ఎంతో ప్రయ త్నించి విఫలమైంది. తాగటం కాక, అనురాగ్‌కు ఇతర స్త్రీలతో సాంగత్యం ఉందని కూడా తనకు చూచా యగా తెలుసు. అయినా తను చేయగలిగింది ...? ఆ విధంగా తాగటం, ఆ తాగిన మత్తులో తాము ఒకటి కావటం అందులో ఆమె మనస్సుకు ఏదో అసంతృప్తి. అనురాగ్ చాలా తక్కువగా మాట్లాడతాడు. ఆ వాతావరణాన్ని భరించలేక అనుపమ మెల్లగా లేచి కిటికీగుండా బయట తోటలోకి చూసింది.

చక్కటి వెన్నెల ... చల్లని వాతావరణం. అల్లంత దూరంలో చిన్నపూరిల్లు. అది రంగ, రింగిల నివాసం. రంగ అక్కడ తోటమాలి. రంగి అనుపమకి పనిమనిషి. వారిద్దరూ వారి పూరింట బయట చాప పరుచుకుని రాత్రి పడుకుంటారు. పైన చల్లని జాబిలి, నక్షత్రాలు. చుట్టుపక్కల సువాసనలను వెదజల్లే పూలమొక్కల మధ్య వారి కలయిక.

'ఓహ్! జీవితమంటే అదేనేమో!' అనిపిస్తుంది అనుపమకి. తనకు పడుకోటానికి ఎయిర్ కండిషన్డ్ గది, డన్‌లప్ డబుల్‌కాట్, విలువైన నగలు, చీరలు, కారు ... దేనికీ తక్కువ లేని జీవితం. అయినా మనసునిండా అసంతృప్తి. కారణం అనురాగ్ తనకు స్వంతం కాదు. రంగ - రంగి ఎంత అన్యోన్యంగా ఉంటారూ! ... అలా సాగుతున్నాయి ఆమె ఆలోచనలు.

చందమామ ఆమె ఆలోచనలను గ్రహించి అనుపమతోపాటు తన వెన్నెల దృక్కులను రంగ రంగిలవైపు మళ్లించాడు. అక్కడ రంగ, రంగి చాపమీద పడుకున్నారు. ఆ నిశ్శబ్ద వాతావరణంలో రంగి నవ్వు, గాజుల శబ్దం మాత్రమే వినిపిస్తోంది. రంగి, రంగతో విడిపోయి మెల్లగా ఒత్తిగిలి పడుకుంది. అలా తిరిగినప్పుడు ఆమె కాళ్ల పట్టీలకున్న మువ్వలు చేసిన సవ్వడి మనోహరంగా ఉంది.

"రంగీ! ఏంటే, మాట్లాడకుండా పడుకున్నావు?" అన్నాడు రంగ.

"ఊఁ ... ఏం మాట్లాడమంటావు, మావా? నీవూ... నీ మోటు సరసం ...! పొడుకున్నదేమో సాప మీద. సాపకింద మట్టి నేల! సూడు, నా ఈపు ఎట్టా రాసుకుపోయిందో!" అంది గోముగా.

ఆ మాటకు రంగ ఆప్యాయంగా ఆమె వీపు నిమిరి తనవైపు తిప్పుకున్నాడు. రంగి అతని ఎదలో గుబురుగా ఉన్న జుట్టును సవరిస్తూ "మావాఁ! అనుపమ్మగోరి పడగ్గదిలో శుబ్బరం సేసేప్పుడు సూస్తా. అబ్బ! ఆ మంచం ఎంత బాగుంటుందో! ఆ మంచం మీద పరుపు ఎంత మెత్తగుంటుందో! దాని మీద మనం పొడుకుంటే ఎంత బాగుంటుందో!" అంటూ ఊహల్లో తేలిపోయింది.

"అవునే .... నిన్ను అట్టా సుఖపెట్టాలని నాకు మాత్తరం లేదా? మరి మనకు అట్టాంటి అదురుష్టం ఎట్టా వస్తది?" రంగ.

చందమామ అక్కడనుండి కింది అంతస్తులో ఏం జరుగుతోందో చూద్దామని తన వెన్నెల చూపులను అటు మళ్లించాడు మోహన్ మాలతి పడక గది కిటికీగుండా.

అక్కడ మోహన్, మాలతిని దగ్గరగా తీసుకుని, "మాలతీ! నీవు ఇంకాస్త ఒళ్లు చేస్తే బాగుంటావు. ఎదురు వాటా మంజుల గారిని చూడు, బొద్దుగా, నిండుగా ఎంత బాగుంటారో!" అన్నాడు.

ఆ మాటలకు మాలతి సర్రున అతని కౌగిలి నుండి విడిపోయి, "ఏం? మీ చూపులు ఆమెమీద పడ్డాయా? నేను గమనిస్తూనే ఉన్నాను. అనవసరంగా కలగజేసుకుని ఆమెతో మాట కలుపుతూంటారు!" అంది కొంచెం కోపంగా.

ఆమె కోపాన్ని చూసి కంగారుపడిపోయాడు మోహన్. వెంటనే సర్దుకుని, "అదికాదోయ్! నీకేం తక్కువని? సన్నగా, నాజూగ్గా ఉన్నావు. ఇంకొంచెం లావెక్కితే ఇంకా బాగుంటావు అనిపించి .... అలా అన్నాను!" అంటూ నసిగాడు.

అప్పటికీ మాలతి చురచురా చూసింది బదులివ్వకుండా.

ఇక తప్పదు కదా అని, ఆమెను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో "అలా కోపంగా చూడకోయ్! నాకు భయమేస్తోంది!" అంటూ దగ్గరగా లాక్కున్నాడు కాస్త విసురుగా. అలా విసురుగా లాక్కోవటంతో ఆమె కాలర్ బోను అతని గుండెను అదిమినట్లయింది. ఆ తాకిడికి వెంటనే అతని మనస్సులో మంజుల మెదిలింది బొద్దుగా, నిండుగా, మెత్తగా ...

జాబిలి అక్కడినుండి చల్లగా జారుకుని ఎదురు వాటా మూర్తి, మంజుల పడక గదిలోకి కిటికీగుండా తొంగి చూశాడు. అక్కడ మూర్తి మంజుల ఒళ్లో తల పెట్టుకుని పడుకున్నాడు. అలా పడుకున్న మూర్తికి మంజుల బుగ్గలు, నున్నగా ఉన్న పొట్ట, మరీ నిగారింపుగా కనిపించి, "మంజూ! నీవు కొంచెం డైటింగ్ మొదలెట్టు. మరీ లావెక్కిపోతే బాగుండదు!" అన్నాడు.

"ఏం, ఎందుకు? నేనేం లావుగా లేనే? కాస్త బొద్దుగా ఉన్నానంతే!" అంది మంజుల.

"లావని కాదు. ఇప్పుడు స్లిమ్‌గా ఉండటం ఫాషన్ కదా! ఎదురింటి మాలతిగారిని చూడు, సన్నగా ఎంత నాజూగ్గా ఉంటుందో ..." అన్న మూర్తి మాట పూర్తి కాకుండానే అతని తల బెడ్‌మీద టప్పున పడింది ఆమె ఒళ్లోనుంచి.

తను అలా మాలతిని మెచ్చుకోలుగా మాట్లాడినందుకు ఆమెకు కోపమొచ్చిందని తెలుసుకుని ఆమె కోపాన్ని ఎలా పోగొట్టడమా అన్న ఆలోచనలో పడిపోయాడు మూర్తి.

చందమామ చూపుల కిరణాలు అక్కడినుండి గ్రౌండ్ ఫ్లోర్‌లోని గంగాధర్, గంగల పడక గదివైపు దారితీశాయి. అక్కడ గంగాధర్, గంగకోసం ఎదురు చూస్తున్నాడు. గంగ వంటిల్లు సర్దుకుని వచ్చి మెల్లగా మంచంపై వాలింది. ఆరోజు గంగాధరం ఆఫీసునుండి ఆలస్యంగా వచ్చాడు. అందువల్ల అనుకున్న ప్రకారం గంగను బీచ్‌కి తీసుకెళ్లలేకపోయాడు. అందుకే ఆమె తను వచ్చిన దగ్గరనుండి ముభావంగా ఉంది. మంచంమీద అటువైపు ఒత్తిగిలి పడుకున్న గంగపైన మెల్లగా చేయి వేసి "గంగా! కోపమొచ్చిందా? ఈ రోజు ఆలస్యమైంది. రేపు తప్పకుండా త్వరగా వచ్చి తీసుకెళ్తాను!" అని సంజాయిషీ చెప్పాడు.

ఇలాంటి వాయిదాలకు అలవాటు పడ్డ గంగ "మీకు మీ పనులు ముఖ్యం, నేను కాదు! నాకు ఈ కూపస్థమండూకంలాంటి జీవితంతో విసుగెత్తి పోతోంది. లేచిన దగ్గరనుంచి పడుకునేదాకా ఈ ఇంటి చాకిరీ! కాలక్షేపానికి టీవీ, పుస్తకాలు తప్ప వేరే మార్పు లేదు. నేనూ చాలా గట్టిగా నిర్ణయించుకున్నాను ఎక్కడైనా జాబ్ చేద్దామని. ఎదురింటి గాయిత్రిని చూడండి వేకువనే లేచి కాస్త వంటా వార్పూ, మిగతా పనులూ చూసుకుని టింగురంగా అంటూ చక్కగా ముస్తాబై ఆఫీసుకెళ్తుంది. వీలైనప్పుడు భర్తతో బయటకెళ్తుంది. అలా ఉండాలి జీవితమంటే! నాలా కూపస్థమండూకంలా కాదు! ఆమెలా నేనూ సంపాదిస్తే నాకూ ఆర్థిక స్వాతంత్ర్యముంటుంది. నేనూ స్నేహితులతోనూ, స్వయంగానూ నాకిష్టమైన చోట్లకు వెళ్లవచ్చు. ఇప్పుడు నా చేతిలో డబ్బు లేదు కనుక ప్రతిదానికీ మిమ్మల్ని అడగాలి!" ....

ఇక ఆ ధోరణి తట్టుకోలేక చందమామ చూపుల కిరణాలు గోపి - గాయత్రి పడక గదివైపు దారితీశాయి.

అక్కడ గోపీ పడుకుని ఉన్నాడు. ఆఫీసు నుండి తెచ్చిన ఫైల్స్‌తో గాయత్రి సతమతమవుతోంది. ఆమెకు నిద్రమత్తుతో కనురెప్పలు వాలిపోతున్నాయి. టైమ్ పన్నెండు గంటలవుతుండగా ఆ పని ముగించి, లైట్ ఆఫ్ చేసి వెళ్లి పడుకుంది. పడుకుందన్నమాటే గానీ నిద్దర పట్టలేదు త్వరగా. మరీ వేకువనే లేవాలి. అన్ని పనులూ ముగించుకుని తినీ తినకుండా ఆఫీసుకు బయలుదేరాలి. సాయంకాలం వచ్చిన తర్వాత మళ్లీ పడుకునేదాకా ఇంటి పని! డబ్బు వస్తుందన్నమాటే కానీ, నిముషం రెస్ట్ లేదు! కంటినిండా నిద్ర లేదు

ఇలా ఆలోచిస్తున్న గాయత్రి, ఎంతసేపటికీ నిద్ర పట్టక అసహనంగా అటూ ఇటూ దొర్లడంతో గోపీకి మెలకువ వచ్చి

"గాయత్రీ! నీవింకా పడుకోలేదా?" అన్నాడు.

"ఆఁ...., లేదండీ! మీకేం? ఇంటికి రాగానే రెస్ట్ తీసుకుంటారు. వండిపెడితే తిని పడుకుంటారు. నేను అటు ఆఫీసు పనితోనూ, ఇటు ఇంటిపనితోనూ సతమతమవ్వాలి. ఎప్పుడో ఒకసారి మీతోనో, స్నేహితులతోనో బయటకు వెళ్లటం తప్ప మరింకేముంది సరదా? ఎదురింటి గంగను చూడండి, హాయిగా ఇంటిపట్టునుండి పనులు చేసుకోవటం, టైమ్ ప్రకారం తినటం, కంటినిండా నిద్ర. బోలెడంత తీరిక. టీవీ చూడటం, పుస్తకాలు చదవటం .... ఓహ్! ఎంత ప్రశాంతమైన జీవితం! నేను జాబ్ మానేద్దామనుకుంటున్నాను. ఎలాగో మీ జీతంతో సర్దుకోవచ్చు!" అంది గాయిత్రి.

ఇద్దరి జీవితంతో ఖర్చులు పోగా మిగిలింది ఆదా చేసి స్వంత ఇల్లు కొనాలి, ఇంకా ఎన్నో వసతులు అమర్చుకోవాలని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్న గోపి ఆమె మాటలకు అవాక్కయిపోయాడు.

శాంతినిలయంలోని విశేషాలను తెలుసుకున్న చందమామ 'దూరపు కొండలు నునుపు' అన్న సామెతలాంటి వారి భ్రమలకు తనలో తాను నవ్వుకుని, 'నేనూ అంతే! దూరం నుండి చూసినప్పుడు నే - నొక వెన్నెల గోళాన్ని. దగ్గరగా చూసినప్పుడు నాలోనూ మచ్చ!' అని అనుకున్నాడు. ■

**పరీక్ష** హాలులో ప్రకాశ్ ముందువాడినుండీ, వెనుకవాడినుండీ చూసి కాపీ కొడుతున్నాడు.

"ఏయ్...ఏంటలా చూస్తున్నావ్?" టీచర్ కోపంగా అడిగింది.

"ఏవిషయంలోనైనా ముందూవెనుకా చూస్కొని ప్రవర్తించాలని మీరేకదా, టీచర్, చెప్పారు!" తెలివిగా అన్నాడు ప్రకాశ్.

-పరిమళా కిశోరి, మేడిబావి